కథానిక

# వంగపండు రంగు వలపు

కొండేపూడి సూర్యకామరాజు

ప్రియా-రాజా,

నువ్వు రాసిన వుత్తరాలు అందుతూనే వున్నాయ్. కాని పనితొందరలో వుండటం వల్ల జవాబు రాయలేక పోయాను. కోపం తెచ్చుకోవద్దు.

నువ్వు నాకొక చిన్న పని చేసిపెట్టాలి. నేను రాసింది జాగ్రత్తగా చదివి దాని ప్రకారం చెయ్యాలి. చాలా అవసరం. నా బీరువాలో మూడో అంతస్థులో కొన్ని సిల్కు చీరెలు వున్నాయి. వాటిల్లో ఆకుపచ్చ అంచుగల వంగపండురంగు చీర వుంటుంది. అది వెంటనే నాకు పంపించు. చాలా అవసరం. బీరువా అంతా కెలికిపారెయ్యకు.

చీరకోసం ఎదురు చూస్తూంటాను.

నీ రాణి.

ప్రేయసీ-రాణీ,

నీ వుత్తరం చూసి నిన్ను చూసినట్టు ఆనందించాను. నీమీద నానున్న ప్రేమలో పదోవంతు నామీద నీకుంటే నా వుత్తరాలన్నిటికీ జవాబు రాసివుందువు. నీకు ఎన్నో వుత్తరాలు రాశాను. అవన్నీ అసలు నువ్వు చదివివుంటావో లేదో అనుమానం. ఎట్లాగైతేనేం యిన్నాళ్ళకు రాశావు. అదైనా నీకు పనివుండి రాశావు. నామీద ప్రేమవుండికాదు. కనీసం నీ వుత్తరాలైనా చూడకపోతే నేను బతకటం చాలా కష్టమన్న సంగతి నువ్వు గ్రహించాలి. ఇకనించయినా తరుచు వుత్తరాలు రాస్తుంటావని నమ్ముతాను.

నీ బీరువాలో మూడో అంతస్థులో వున్న వంగపండురంగు చీర పంపించమని రాశావు. మూడో అంతస్థంటే పైనించి మూడోదా?— కిందనించి మూడోదా? వెంటనే రాయి.

నీ రాజు.

ప్రియా-రాజా,

నీ వుత్తరం చదివి ఆశ్చర్యపోయాను. నీమీద నాకు ప్రేమలేదేమో నని నువ్వెందుకు అనుకోవలసివచ్చిందో నాకర్థంకాలేదు. నేను "ప్రేమ ప్రేమ" అని వూరికే వాగేదాన్ని కాదు. మాటల్లో కంటె క్రియల్లో నా ప్రేమ ఎక్కువ కనపడుతుంది. నేను నీదగ్గరవుంటే నాకు నీమీద ఎంత ప్రేమవున్నదీ నీకర్థమయ్యేది. నువ్వంటే నాకు నిజంగా చాలా ప్రేమ. అస్తమానం నీమాటే తలుచుకుంటూంటాను. నా శరీరం యిక్కడుంది. కాని నాఆత్మ నీదగ్గరే వుంది. నా ప్రేమనిగూర్చి నువ్వేం బెంగపెట్టుకోవద్దు.

కిందటి వుత్తరంలో రాసిన వంగపండురంగు చీర వెంటనేపంపు. పైనించి మూడో అంతస్థు. మరచిపోవద్దు. బీరువాఅంతా కెలికెయ్యకు.

నీ రాణి.

ప్రేయసీ-రాణీ,

నువ్వు ప్రేమతో రాసిన వుత్తరం చదివినప్పుడు నాకు కలిగిన ఆనందాన్ని వర్ణించలేను. నీ వుత్తరాన్ని కనీసం కొన్ని వందలసార్లయినా ముద్దు పెట్టుకుని వుంటాను. నీకు నామీద యింత ప్రేమ వుందని తెలిసికూడా నీ ఎడబాటు సహించటం అసాధ్యం. సెలవు దొరికితే తప్పకుండా వస్తాను. నీ వుత్తరంమీద ముద్దులవర్షం కురిపించటంవల్ల 'మూడో అంతస్థు' అన్న మాటకు ముందున్న మాట నానోటి తడి తగిలి చెరిగిపోయింది. నా అజాగ్రత్తకి కోపం వచ్చినా, నా అజాగ్రత్తకి కారణం నీ మీద వున్న ప్రేమే అని తెలిసి నన్ను క్షమిస్తావని నమ్ముతున్నాను. పైనించి మూడో అంతస్తో, కిందనుంచి మూడో అంతస్తో వెంటనే వుత్తరం రాయి.

నీ రాజు.

ప్రియా-రాజా,

నీ ఉత్తరం చూడగానే వళ్లు మండింది. ఈసారైనా నా ఉత్తరాన్ని నీ అధరామృతంతో తడిపెయ్యకుండా వంగపండు రంగుచీర పంపించు. చాలా అవసరం. పైనించి మూడో అంతస్థు అంటే కిందనించి రెండో దన్నమాట. మరచిపోవద్దు. నువ్వు అనవసరంగా సెలవుపెట్టి యిక్కడకు రావద్దు. వీలుగావుంటే నేనే సెలవుపెట్టి అక్కడకు వస్తాను. చీరమాత్రం మరిచిపోకుండా పంపు. వంగపండు రంగుచీర, జరీపమిటంచు వుంటుంది. వెంటనే పంపు, చాలా అవసరం. నీ మీద నాకు ప్రేమలేదని మాత్రం అనుకోవద్దు. నువ్వంటే చాలా ప్రేమ. చీరమాత్రం వెంటనే పంపు.

నీ రాణి.

ప్రేయసీ-రాణీ,

నామీద నీకు చాలా ప్రేమ అని రాశావు. నీమీద నాకు అంతకన్న ఎక్కువ ప్రేమ. నీ చిరునవ్వు చూసి ఆనందించే సుదినంకోసం ఎదురుచూస్తున్నాను. సాధ్యమైనంత త్వరలో నువ్విక్కడకు రావలెను. ఇక నీ ఎడబాటు సహించలేను. తప్పక వస్తావని ఆశిస్తున్నాను.

పైనించి మూడో అంతస్థులో-అంటే కింద నించి రెండో అంతస్థులో చాలా చీరలు వున్నాయి. వంగపండురంగంటే నా కర్థం కాలేదు. ఆ రంగుకి ఇంగ్లీషులో ఏమంటారు? వంగ పండు రంగు తెలుసుకోలేనందుకు నీకు కోపం వస్తుందేమో.. కాని నేనేం చెయ్యను చెప్పు?ఆ రంగు నాకు తెలీదు. తెలుగూ ఇంగ్లీషు డిక్షనరీ కోసం ప్రయత్నించాను. ఎక్కడా దొరకలేదు. మార్కెట్టులో వంకాయలున్నాయి కాని వంగ పళ్లు లేవు. వంగ పండు తెచ్చి పెట్టమని కూరలు అమ్మే గంగమ్మతో చెప్పాను. తెస్తానంది. బహుశా రెండు మూడు రోజుల్లో తేవచ్చు. వంగ పండు రాగానే వంగపండు రంగుచీర పంపిస్తాను. ఈలోగా నువ్వుకూడా వంగపండు రంగంటే అర్థమయ్యేటట్టు ఉత్తరం రాయి. ఆలస్యమైనందుకు కోపగించవద్దు.

నీ రాజు.

ప్రియా-రాజా,

నీ తెలివి తేటలు చూసి ఏడవాలో నవ్వాలో తెలీటంలేదు. వంగపండు రంగుచీర అంటే ఏమిటో తెలియని మగవాడివి ఏం మగవాడివి? వంగపండురంగు అంటే ఎవళ్లనడిగినా చెప్తారు. వంగపండు రంగంటే వంగపండు రంగన్నమాట. కొంచెం పసుపు రంగును పోలి వుంటుది; కాని పసుపు రంగు మాత్రం కాదు. వంగపండు రంగుకి యింగ్లీషులో ఏమంటారో నాకూ తెలియదు. బచ్చలి పండురంగుకి మాత్రం మెరూన్ అంటారు. కూరల గంగమ్మ యీ పాటికి వంగ పండు తెచ్చి వుంటుందనుకుంటాను. అది ఒకొక్కక్క చీరదగ్గరే పెట్టిచూస్తే వంగపండు రంగు చీర ఏదో తెలిసిపోతుంది. ఒకవేళ గంగమ్మ వంగపండు తేకపోతే ఏదన్నా బట్టల షాపుకి వెళ్లి వంగపండు చీర చూపించమని అడుగు. వాళ్లు చూపిస్తారు. ఆ రంగు జ్ఞాపకం పెట్టుకుని నా బీరువాలో పైనించి మూడో అంతస్థులో - అంటే కిందనించి రెండో అంతస్థులో వున్న చీరలు జాగ్రతగా చూస్తే వంగపండు రంగుచీర ఏదో నీకే తెలుస్తుంది. ఆ చీర పంపు. చాలా అవసరం. వంగపడు రంగుచీర - పైనించి మూడో అంతస్థు, మరిచిపోవద్దు.

నీ రాణీ.

ప్రేయసీ-రాణీ,

నువ్వు రాసిన ఉత్తరం చేరింది. నీ ఉత్తరాల్లో ముత్యాల్లాంటి నీ అక్షరాలు చూస్తే మతిపోతూంది. నిన్ను వదలి యింకొక్కక్షణం కూడా వుండలేను. నువ్వు యిక్కడకు రావటానికి వీలౌతుందో లేక నన్నే అక్కడకు రమ్మంటావో వెంటనే రాయి. నామీద నీకు ఎంత ప్రేమవుందో నాకు తెలుసు. నీమీద నాకు అంతకన్న ఎక్కువప్రేమ వుందన్న సంగతి నువ్వు తెలుసుకోవాలి. అస్తమానం నిన్ను గురించే ఆలోచిస్తూంటాను. నువ్వు రాకపోతే బతకలేనేమో అని భయమేస్తోంది. తప్పకుండా రావటానికి ప్రయత్నించు.

ఎన్ని షాపులు తిరిగినా వంగపండురంగు చీర కనపడలేదు. గంగమ్మకి జ్వరం వచ్చిందిట. తనురాలేదు. కూతురుచేత వంగపండు మాత్రం పంపించింది.' కాని అది కుళ్ళిపోయింది. నీకు

కావలసినది కుళ్ళిపోయిన వంగపండురంగు చీర కొదనుకుంటాను. కుళ్లని పంగపండు రంగు ఎట్లావుంటుందని గంగమ్మ కూతుర్ని అడిగాను. తన జడలో పెట్టుకున్న పువ్వులు తీసి నా కిచ్చింది. ఆపువ్వుల రంగు కూడా వంగపండు రంగేనట. ఆరంగు చీరలు మూడు నీబీరువాలో పైనించి మూడో అంతస్థులో వున్నై. ఆ మూడిటిలో ఆకుపచ్చ అంచువున్న చీర ఒకటి వుంది, అది నీకు పంపాలని అనుకున్నాను. కాని గంగమ్మకూతురు నవ్వుతూ ఎగతాళిగా మాట్లాడుతుంది. దాని మాటలు నమ్మాలో నమ్మకూడదో నాకర్థం కాలేదు. కనకాంబరాల రంగూ, వంగపండురంగూ ఒకటేనా? ఒకటే అయితే వెంటనే చీర పంపిస్తాను. గంగమ్మ కూతురు యిచ్చిన కనకాంబరాలు కూడా నీ బీరువాలో మూడో అంతస్థులో దాచిపెట్టాను. వెంటనే ఉత్తరం రాయి.

నీ రాజు.

ప్రియా-రాజా,

నువ్వు నాకు నాకు చాలా కోపం తెప్పిస్తున్నావు. అసలు గంగమ్మ కూతుర్ని మనయింటికి ఎవరు రానియ్యమన్నారు? పైగా దాని తలలో పువ్వులు తీసుకుని బీరువాలో దాచుకున్నానని రాశావు. నీకు సిగ్గులేదా? ఈ మాటెప్పుడూ దాన్ని మనగుమ్మం తొక్కనియ్యొద్దు. అది వచ్చినా మెడపట్టి గెంటెయ్. నువ్వు దానితో మాట్లాడవద్దు. కనకాంబరాలరంగుకూ వంగపండు రంగుకూ అట్టే భేదంలేదు. కనకాంబరాలతో ఒక్కొక్క చీరా పోల్చిచూడు. అందులో ఏ చీర రంగు కనకాంబరాల రంగులో ఎక్కువ పోలివుంటుందో ఆ చీర పంపు. మా క్లబ్బువాళ్లు నన్ను సెక్రెటరీగా ఎన్నుకున్నారు. ఆ సందర్భంలో వాళ్ళంతా నాకు టీపార్టీ యివ్వాలని అనుకొంటున్నారు. ఇన్నాళ్ళదాకా ఎట్లాగో పోస్ట్‌పోన్ చెయ్యగలిగాను కాని ఇక చెయ్యటం కష్టం. అందువల్ల చీర వెంటనే పంపు. నిన్ను చూడాలని నాకూ వుంది. నాకోసం బెంగ పెట్టుకోకు, చీరమాత్రం వెంటనే పంపు.

నీ రాణి.

ప్రేయసీ-రాణీ,

నీకు కోపం తెప్పించినందుకు క్షమించు. ఈసారి నీకోపం పోగొట్టే పని చేశాను. గంగమ్మ కూతురికి మంచి శాస్తి చేశాను. నిన్నసాయంత్రం చీకటిపడ్డాక మెరూన్‌రంగు చీర కట్టుకుని వంగపండు తీసుకుని గంగమ్మకూతురు వచ్చింది. ఈసారి కుళ్ళిపోయిన పండు తేలేదు. మంచిదే తెచ్చింది. అపండు దాని ముఖాన్న కొట్టి బయటకు గెంటి తలుపు గడియవేశాను. ఇది విని చాలా సంతోషిస్తావని నాకు తెలుసు. నీ సంతోషమే నా సంతోషమన్న సంగతి కూడా నాకు తెలుసు. అస్తమానం నీ సంగతే ఆలోచిస్తుంటాను. రాత్రి చక్కటికలగన్నాను. మనిద్దరం పూలతోటలో వెన్నెట్లో వుయ్యాల వూగుతున్నాము. నీ బుజంమీద వాలి కొంత సేపటికి నిద్రపోయాను. కళ్లు తెరిచి చూసే టప్పటికి... విచిత్రం! నువ్వు మాయమై నీ స్థానంలో గంగమ్మకూతురు కనకాంబరాలు పెట్టుకుని సిద్ధమయింది. మేము యిద్దరం కలసి ఎంతసేపు ఊగామో... అబ్బబ్బ! తలుచుకుంటే వొళ్లు గగుర్పొడుస్తుంది!

నువ్వు సెక్రెటరీగా ఎన్నిక అయినందుకు మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. బీరువాలో దాచిన కనకాంబరాలు ఎండిపోయినై. నీకు చీర ఎంత అవసరమో గ్రహించాను కనక, నా తెలివి వుపయోగించి వంగపండు రంగుచీర పోస్టుద్వారా నిన్ననే పంపించాను. అందగానే వుత్తరం రాయి.

నీ రాజు.

ప్రియా-రాజా,

నువ్వు పంపిన చీర చూడగానే ఆశాభంగం కలిగింది. నువ్వుపంపినది పసుపురంగు చీర. వంగపండురంగుది మాత్రం కాదు. నీకు తెలివి అన్నది ఏకోశానా లేదు. ఆ గెంటేదేదో వంగపండు లాక్కుని గెంటితే ఎంతబాగుండును! ఈమాటైనా ఎవరైనా తీసుకువచ్చి మూడో అంతస్థులో చీరలు చూపించి వంగపండురంగు చీర ఏదో కనుక్కుని వెంటనే పంపు. టీపార్టీ తొందరగా చెయ్యాలని మా క్లబ్బువాళ్లు తొందర పడుతున్నారు. నీకు నామీద ఏ మాత్రం ప్రేమవున్నా వంగపండురంగు చీర

వెంటనే పంపిస్తావు. ఈసారి చీర తప్పక పంపిస్తావు. నాకు తెలుసు. నువ్వు అనవసరంగా తొందరపడి సెలవుపెట్టి రావద్దు. నేనే వీలు చూసుకుని అక్కడకు వస్తాను.

గంగమ్మ కూతుర్ని కలలోకి కూడా రానియ్యొద్దు. ఈసారి అటువంటి కలగన్నావా మర్యాద దక్కదు. చీర విషయమై యింకా ఏదన్నా సందేహం కలిగితే ట్రంక్ ఫోన్‌లో నన్నడుగు.

నీ రాణి.

ప్రేయసీ-రాణీ,

నా తెలివితక్కువతనం వల్ల పసుపురంగు చీర పంపినందుకు విచారిస్తున్నాను. ఈమాటు జాగ్రత్తగా ఆలోచించి వంగపండురంగు చీర పంపటానికి ప్రయత్నిస్తాను. నీ బీరువాలో మూడో అంతస్థులో చీరలన్నీ సుగుణకి చూపించి వంగపండురంగుచీర ఏదని అడిగాను. వంగపండురంగు తనకి కూడా సరిగ్గా తెలియదుట. నీతో ట్రంక్ టెలిఫోన్‌లో మాట్లాడదామని పక్కయింటికి వెళ్లాను. గుమ్మంలో ఒక అందమైన అమ్మాయి కనపడింది. ఒంటికి తగ్గ పొడుగూ, పొడుక్కితగ్గ వొళ్ళూ—ఎంతో బాగుంది. ఒకసారి టెలిఫోన్ ఉపయోగించటానికి అనుమతించమని ఆమెను బతిమాలాను. వాళ్ళ అత్త యింజనీరుగారింటికి పేరంటానికి వెళ్ళిందిట. అత్తగారి అనుమతిలేందే టెలిఫోన్ ఎవరూ ముట్టుకోటానికి వీల్లేదుట. ఆమెగారు వస్తారేమోనని వీధిగుమ్మంలో మూడు గంటలు పడి కూర్చున్నాను. ఆవిడ రాలేదు. నిరాశతో యింటికి తిరిగివచ్చాను.

ఒక తెలివైన పనిమాత్రం చేశానని రాయటానికి గర్విస్తోన్నాను. మాధవరావు గారి యింటినించి వంగ విత్తనాలు తెప్పించి మన పెరట్లో జల్లాను, రోజూ నీళ్లు పోస్తున్నాను. మొక్కలుమొలిచి, కాయలుకాసి పండగానే నీ చీర పంపిస్తాను. నువ్వేమీ బెంగపెట్టుకోవద్దు. నేనింత బాధ పడుతున్నానంటే అది ఎవరికోసం?—నీకోసమే. నీమీద నాకు వున్న ప్రేమనుగూర్చి నువ్వెప్పుడూ సందేహించనక్కర్లేదు. సెలవిచ్చి తీరాలని ప్రిన్సిపాల్ గారిని బతిమాలాను. సరే ఆలోచిస్తానన్నారు. ఆయన ఆలోచించటం అవగానే నీదగ్గరకు వస్తాను.

గంగమ్మకూతురు నిన్న కూడా కలలోకి వచ్చింది. మళ్ళీ నాతో ఉయ్యాల వూగింది. ఉయ్యాలమీంచి కిందకి నెట్టేశాను. పొద్దున్నే లేచి చూసుకు నేసరికి బిగ్ బెన్ బద్దలయివుంది. నాకొక బిగ్ బెన్ కొని పంపించు.

వంగ మొక్కమొలిచి కాయలుకాసి పండగానే వంగపండు రంగుచీర పంపిస్తాను. కోపం తెచ్చుకోవద్దు.

నీ రాజు.

ప్రియా-రాజా,

నిన్నూ, నీ వుత్తరాల్నీ చూస్తోంటే ఒళ్ళు మండిపోతూంది. వంగపండు రంగు నీకు తెలియకపోతే యింకెవరికీ తెలియదా? తెలిసినవాళ్ళ కెవరికయినా చూపించి ఆ చీర ఏదో తెలుసుకోకూడదా? టెలిఫోన్ చెయ్యటానికి పక్కయింటికి ఎవరు వెళ్ళమన్నారు? పోస్టాఫీసుకి వెళ్ళి ఫోన్ చెయ్యలేక పోయావా? ఈ మాటు పక్కయింటికి వెళ్ళావని తెలిస్తే నే నూరుకు నేదిలేదు. నే నేదన్నా అంటే జరిగించి చీర్తాను. ఆ సంగతి నీకు తెలుసు.

సుగుణకి చూపించానన్నావు. ఆ సుగుణ ఎవరు? వయస్సెంత? ఎట్లావుంటుంది? వెంటనే వివరంగా వుత్తరంరాయి. గంగమ్మకూతురు మళ్ళీ కలలోకి వచ్చిందని రాశావు. ఈసారి వస్తే వచ్చింది కాని యింకోసారి వస్తే మర్యాద దక్కదు.

నువ్వు చల్లిన వంగవిత్తనాలు మొలిచి కాయలుకాసి పండేదాకా టీపార్టీ ఆగదు. మూడో అంతస్థులో చీరలన్నీ బట్టలషాపుకి తీసుకువెళ్ళి వాళ్ళకు చూపించు, వంగపండు రంగుచీర ఏదో వాళ్లు చెప్తారు. అది వెంటనే నాకు పంపించు. మరిచిపోవద్దు. బద్ధకించవద్దు. వెంటనే పంపు.

నీ రాణి.

ప్రేయసీ-రాణీ,

నాకు నీమీదవున్న ప్రేమను ఆధారం చేసుకుని నువ్వు నన్ను అనరానిమాటలంటున్నావు. అందరూ నన్ను చాలా తెలివైనవాడు అంటారు. నీ దృష్టిలో మాత్రం తెలివి తక్కువ దద్దమ్మని



"ఫెస్టివల్ ఆఫ్ బ్రిటన్" వనిత. ఈ ఉత్సవ నిర్వహణలో పనిచేసే స్త్రీ ఉద్యోగులకు పై యూనిఫారం నిర్ణయించారు.

---

నువ్వెన్ని తిట్టినా నా ప్రేమ తగ్గదు. నిన్నరాత్రి వెన్నెట్లో పక్క వేసుకుని పడుకున్నాను. నిద్ర పట్టలేదు. ప్రిన్సిపాల్ గారి ఆలోచన యింకా పూర్తవలేదు. అవగానే బంతులుదేరి వస్తాను.

సుగుణ నీలాగే అందంగావుంటుంది. వయసు పందొమ్మిదట. కాలేజీలో చదువుతోంది. ట్యూషన్ చెప్పించుకోటానికి రోజూ సాయంత్రము నా దగ్గరకు వస్తోంది. జీతంసంగతి తను అడగనూలేదు; నేను చెప్పనూలేదు. కాని పాతికో, యిరవయ్యో యిస్తుందనుకుంటాను. గంగమ్మ కూతురు కలలోకూడా కనిపించటం లేదు.

14 నీ బీరువాలో మూడో అంతస్థులో చీరెలన్నీ నిన్న బజారుకి రిక్షామీద తీసుకెళ్ళాను. కాని ఆదివారం అవటంవల్ల కొట్లన్నీ మూసివున్నయ్. ఒక కొట్టుకూడా తెరచిలేదు. ఈవాళ తీసుకు వెడదామంటే పొద్దుటినుంచీ ఒకటే వర్షం! సాయంత్రం తెరిపియిస్తే తప్పక తీసుకువెళ్ళి వంగపండురంగు చీరె ఏదో కనుక్కొని వెంటనే పంపుతాను. అక్కడకూడా వర్షాలు కురుస్తున్నయా?

వంగ విత్తనాలు యింకా మొలవలేదు. పోనీ కూరకన్నా పనికొస్తాయని నీళ్లు మాత్రం పోస్తున్నాను.

నీ రాజు.

ప్రియ-రాజా!

సుగుణకి మన యింట్లో ట్యూషన్ చెప్పటానికి వీల్లేదు. అంతగా కావాలంటే వాళ్ళ యింటికి వెళ్ళి చెప్పు. ఈ ఉత్తరం అందేక సుగుణ మన యింటికి వచ్చిందంటే నిన్ను యింకెప్పుడూ నా దగ్గిరకే రానియ్యను. నన్ను ముట్టుకోనియ్యను. కాబట్టి సుగుణని నీ దగ్గరకు రానియ్యకు; నువ్వే వాళ్లయింటికివెళ్లి ట్యూషన్ చెప్పు.

వచ్చే మంగళవారంనాడు టీపార్టీ చెసెయ్యటానికి నిర్ణయించారు. అంటే సోమవారం నాటికల్లా చీర నాకు అందాలి. ఈసారి చీర పంపకపోతే నే నూరుకోను. వంగ పండు రంగు చీర పంపాలి. నా చీరలు షాపుకి తీసుకువెళ్ళి వంగపండు రంగుచీర ఏదో కనుక్కొని మరీ పంపు. మరిచిపోవద్దు. సోమవారం లోగా నాకు అందాలి. అట్లా అందితేనే నీకు బిగ్ బెన్ కొంటాను. బద్ధకించకు. వెంటనే పంపు.

నీ రాణి.

ప్రేయసీ-రాణీ,

నీ వుత్తరం మూడు రోజుల క్రితం అందివుంటే సుగుణని మనింటికి రానిచ్చేవాడిని కాను.

సుగుణకి యిల్లూ వాకిలీ లేదుట. ఒక ధనికుల యింట్లో పిల్లలకు చదువు చెప్తూ అక్కడే భోంచేస్తూ ఎట్లాగో కష్టపడి కాలేజీలో చదువు తుందిట. కాని ఆ వాతావరణంలో తనకు చదులేమీ సాగటం లేదుట. నాకు వండి పెడుతూ నాదగ్గరే వుంటానని బతిమాలింది. హోటల్ మెతుకులు తప్పుతాయికదా అని సరే అన్నాను. సుగుణ చాలా మంచిది. వంట చాలా బాగా చేస్తోంది. నువ్వులేని లోటు రానియ్యటం లేదు. యింత చేస్తున్నా తనకి ముట్టే ప్రతిఫలం ట్యూషనేగా. అందువల్ల సుగుణని నా దగ్గర వుంచుకోటానికి నువ్వేం అడ్డు చెప్పవని నమ్ముతాను.

నీకొక శుభవార్త. నిన్న మధ్యాహ్నం సుగుణ వండిన వంకాయకూర వేసుకుని భోంచేసి ఒక గంట విశ్రమించి నీ చీరలు బజారుకి తీసుకు వెళ్ళాను. వంగపండు రంగుచీర ఏదో తెలిసిపోయింది. అది జాగ్రత్తగా పేక్ చేసి పోస్టాఫీసుకి వెళ్ళేటప్పటికి పార్సెలు తీసుకునే టయిము అయిపోయింది. సాయంత్రం సుగుణ వచ్చి సినిమా కెడతాను చీర ఒకసారి ఇమ్మని అడిగింది. ఇవ్వనని ఎట్లా అనగలను చెప్పు?- ఇచ్చాను. సినిమానించి తిరిగివచ్చి చీర మార్చటానికి బద్ధకించి ఆ చీరతోనే పడుకుంది. పొద్దుటికి చీర బాగా నలిగిపోయింది. వెంటనే లాండ్రీకి పంపించాను. ఎల్లుండి యిస్తానన్నాడు. రాగానే పంపుతాను.

ప్రిన్సిపాల్ గారు సెలవు యివ్వటానికి వీల్లేదన్నారు. ఇప్పట్లో నీ దగ్గరకు వచ్చే అదృష్టం నాకు లేదు. నీకైనా సెలవు దొరుకుతుందంటే నమ్మకం లేదు. వ్యతిరేకించిన పరిస్థితులతో దెబ్బలాడేకన్న, వాటికి లొంగివుంటేనే మంచిది. నాకోసం బెంగ పెట్టుకోవద్దు.

లాండ్రీనించి రాగానే వంగపండు రంగు చీర పంపిస్తాను. సోమవారంనాటికి కాకపోయినా బుధవారం నాడైనా అందుతుందని అనుకొంటున్నాను.

నీ రాజు.



**త్వరలో ఇంగ్లండునుండి ఒక నాటక సంఘం బయలుదేరి ఇండియా, పాకిస్తాన్ దేశాలు పర్యటన చేయనున్నది. బ్రిటిష్ కౌన్సిల్ అధ్వర్యాన వీరి పర్యటన జరుగుతుంది వారు. ప్రదర్శించనున్న షేక్స్పియర్ నాటకాలలో స్త్రీపాత్రలు ధరించనున్న నటీమణి ఫ్రాన్సెస్ క్లేర్.**

---

ప్రియా-రాజా,

నీకీ వుత్తరం తొమ్మిదవ తేదీ మధ్యాహ్నం అందుతుంది. సాయంత్రం అయిదింటికి ఈ వూరు వచ్చే మెయిలుంది. నువ్వు ఆ మెయిలులో బయలుదేరి యిక్కడకు రావాలి. అర్జంటు పని వుంది. సెలవు దొరకలేదని వంకపెట్టొద్దు. ఉదోగ్యం మానుకొనిరా. నేను అయిదు వందలు సంపాయిస్తున్నాను. అవి మనిద్దరకూ చాలు. నువ్వు తొమ్మిదవ తారీకు మెయిల్లో రాకపోతే పదకొండో తేదీ సాయంత్రానికి నేనే నీ దగ్గర వుంటాను. నేను తలచుకొన్నది జరిగితీరుతుందన్న సంగతి నీకు బాగా తెలుసు.

నీతో వంగపండు రంగు చీరమాత్రం తీసుకు రావద్దు.

**నీ రాణి.**